క్లుప్తంగా

టారిఫ్ ప్రతిపాదనలపై ప్రజాభిప్రాయ సేకరణ



నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ టారిఫ్ ప్రతిపాదనలపై బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణను ఈ నెల 19 నుంచి 21 వరకు నిర్వహించనున్నామని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. దీనికి సంబంధించిన ట్రయన్ రన్‌ను నగరంలోని విద్యుత్ భవన్‌లో మంగళవారం నిర్వహించారు. ఆన్‌లైన్ ద్వారా ఏపీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడారు. 2023 – 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆర్థిక ఆవశ్యకత, విద్యుత్ చార్జీల ప్రతిపాదనలపై ఆన్‌లైన్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణను నిర్వహించనున్నామని చెప్పారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 4.30 వరకు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని ఆపరేషన్ డివిజన్ కార్యాలయాల్లో ఆన్‌లైన్ ద్వారా.. నెల్లూరు నగర, రూరల్ డివిజన్లకు సంబంధించి విద్యుత్ భవన్‌లో నిర్వహించనున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో పాల్గొనాలనుకునే వారు ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ (టెక్నికల్) సుబ్బరాజు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు సోమశేఖర్‌రెడ్డి, బాలచంద్ర, అకౌంట్స్ ఆఫీసర్ శ్రీనివాసులు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు శ్రీధర్, సునీల్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి షూటింగ్ బాల్ జట్ల ఎంపికలు నేడు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లా స్థాయి శాప్ షూటింగ్ బాల్ సబ్ జూనియర్స్ అండర్ – 17, 21 బాలబాలికల జట్లను ముత్తుకూరు మండలంలోని జెడ్పీ హైస్కూల్లో బుధవారం ఎంపిక చేయనున్నామని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ, సెట్నెల్ సీఈఓ పుల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారు రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఆధార్ కార్డుతో హాజరుకావాలని, వివరాలకు 83413 48878 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రాణాప్రతాప్‌సింగ్ వర్ధంతి సభ నేడు

నెల్లూరు(బృందావనం): దేశ భక్తుడు మహారాణా ప్రతాప్‌సింగ్ వర్ధంతి సభను బుధవారం నిర్వహించనున్నామని బొందిలి సంఘ నగరాధ్యక్షుడు శ్రీనివాస్‌సింగ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూలాపేటలోని అన్నదేవుల గోవిందరెడ్డి సరస్వతీ సమాజ భవనంలో కార్యక్రమాన్ని జిల్లా బొందిలి సంఘం, హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్నామని పేర్కొన్నారు. కార్యక్రమానికి తరలిరావాలని కోరారు.

యోగి వేమన జయంతి రేపు

నెల్లూరు(వేదాయపాళెం): ప్రభుత్వ ఆదేశాల మేరకు యోగి వేమన జయంతిని కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో గురువారం ఉదయం పది గంటలకు నిర్వహించనున్నామని జిల్లా పర్యాటక శాఖ ఇన్‌చార్జి అధికారి కనకదుర్గా భవాని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు కవులు, పండితులు, ప్రభుత్వ శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

బహుమతుల అందజేత



నెల్లూరు రూరల్: రూరల్ పరిధిలోని 35వ డివిజన్ లేక్‌వ్యూ కాలనీలో రంగవల్లుల పోటీలను మంగళవారం నిర్వహించారు. విజేతలకు బహుమతులను వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మేయర్ స్రవంతి అందజేశారు. ఈ సందర్భంగా గిరిధర్‌రెడ్డి మాట్లాడారు. సంక్రాంతి సందర్భంగా రంగవల్లుల పోటీలను నిర్వహించడాన్ని అభినందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వాసంతి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు శరత్‌చంద్ర, నేతలు జయవర్ధన్, రంజిత్, రఫీ, అల్తాఫ్, బాబీ, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

నెల్లూరు(బృందావనం): నగరంలోని వివిధ ప్రాంతాల్లో నిరుపేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు సుబ్బారావు మాట్లాడారు. కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్, కృపాదరణ మినిస్ట్రీస్, అరిగెపూడి విజయ్‌కుమార్ సహకారంతో దాదాపు 300 మందికి దుప్పట్లను అందజేశామని ఆయన చెప్పారు. అనంతరం అల్పాహారాన్ని పంపిణీ చేశామన్నారు.

మేత పోరంబోకు భూములకు పట్టాలివ్వం



భూములను పరిశీలిస్తున్న తహసీల్దార్, తదితరులు

పొదలకూరు: మేత పోరంబోకు భూములకు రెవెన్యూ శాఖ పట్టాలివ్వదని, సదరు భూములు ఆయా పంచాయతీల ఆధీనంలోనే ఉంటాయని తహసీల్దార్ ప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని సూరాయపాళెంలో మేత పోరంబోకు భూములను కొందరు ఆక్రమించుకొని సాగు చేసుకుంటున్నారనే ఫిర్యాదులు అందడంతో తహసీల్దార్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సర్వే నంబర్ 352లోని మేత పోరంబోకు భూములను కొందరు ఆక్రమించుకొని సాగు చేస్తున్నారని కొన్ని పత్రికలు, సోషల్ మీడియాలో కథనాలు ప్రచురితమయ్యాయని చెప్పారు. సదరు భూములు రూ.కోట్ల మేర విలువజేస్తాయనడంలో వాస్తవం లేదన్నారు. తాను తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టక ముందు నుంచే భూములను సాగు చేస్తున్నారని తెలిపారు. ఈ భూములకు పట్టాలను అందజేయమని స్పష్టం చేశారు. ఆక్రమణకు గురైన భూముల విషయమై పంచాయతీ నిర్వాహకులు లేఖ రాస్తే తొలగించి అప్పగిస్తామని చెప్పారు. సర్వేయర్ వెంకటేశ్వర్లు, ఆర్ఐ నవీన్, వీఆర్వో రాగయ్య, సర్పంచ్ వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

షటిల్ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం



కోవూరు: సంక్రాంతిని పురస్కరించుకొని కోవూరు మండల పరిషత్ క్రీడా ప్రాంగణంలో కోవూరు, కొడవలూరు, విడవలూరు మండలాలకు సంబంధించిన షటిల్ పోటీలను పెద్ది ప్రభావతి మెమోరియల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. విజేతలకు బహుమతులను కోవూరు మండల ఉపాధ్యక్షుడు నరసింహులురెడ్డి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పోటీలను జిల్లా స్థాయిలో నిర్వహించేలా చర్యలు చేపట్టాలని నిర్వాహకులను కోరారు. తొలుత విజేతగా నిలిచిన జోసఫ్ జట్టుకు రూ.10,116, మెమెంటోను అందజేశారు. నిర్వాహకులు మారుతి నాగార్జున, అవినాష్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, శ్రీనివాసులు, నిరంజన్, దయాకర్, పవన్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

నిందితుల బైండోవర్



కొడవలూరు: మద్యం అక్రమ విక్రయదారులు ఇద్దరు, నాటు సారా విక్రయదారుడు ఒకర్ని తహసీల్దార్ ఎదుట ఎస్ఈబీ అధికారులు మంగళవారం బైండోవర్ చేశారు. రేగడిచెలికకు చెందిన పుల్లయ్య నాటు సారాను గతేడాది విక్రయిస్తుండగా ఎస్ఈబీ అధికారులు పట్టుకున్నారు. కర్ణాటక మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తుండగా నాయుడుపాళెనికి చెందిన వెంకటరమణయ్య, సుబ్బరాయుడ్ని ఎస్ఈబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో రూ.రెండు లక్షల పూచికత్తు, ఏడాది పాటు బైండోవర్ అమల్లో ఉండేలా తహసీల్దార్ రమాదేవి ఎదుట ఎస్ఈబీ సీఐ నరహరి, ఎస్సై శ్రీనివాస్ హాజరుపర్చారు. ఈ సందర్భంగా నరహరి మాట్లాడారు. పొరుగు రాష్ట్రాల మద్యం విక్రయాలు, తరలింపు, నాటు సారా స్థావరాలు, తదితరాలపై 14500 నంబర్‌కు సమాచారమివ్వాలని కోరారు. ఎస్ఈబీ కానిస్టేబుల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సారా రహిత గ్రామాలుగా గుర్తింపు పొందాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

పొదలకూరు: నాటుసారా రహిత గ్రామాలుగా బిరదవోలు, బ్రాహ్మణపల్లి గుర్తింపు పొందాలని, సారా తయారు చేసినా.. తాగినా తీవ్ర పరిణామాలు తప్పవని బిరదవోలు దత్తత అధికారి, నెల్లూరు ఎస్ఈబీ సీఐ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. జేడీ శ్రీలక్ష్మి ఆదేశాల మేరకు బిరదవోలు సచివాలయం, బ్రాహ్మణపల్లి పాఠశాలల్లో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సుల్లో ఆయన మాట్లాడారు. సారా కేంద్రాలపై మహిళలు నిఘా ఉంచి సమాచారం అందించాలని కోరారు. ఇతర పనులు చేసుకొని జీవనోపాధి పొందేందుకు ప్రభుత్వం సహకరిస్తుందని తెలిపారు. సారాను తయారు చేస్తున్న గ్రామాలను దత్తత తీసుకొని.. సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఎస్ఈబీ అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకున్నారని పేర్కొన్నారు. ఎస్ఈబీ పొదలకూరు ఇన్‌చార్జి సీఐ ప్రభాకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

భద్రతపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



విద్యార్థికి బహుమతిని అందజేస్తున్న జీజే రావు

ముత్తుకూరు: జీవితం.. విధి నిర్వహణలో భద్రతపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని అదానీ కృష్ణపట్నం పోర్టు సీఈఓ జీజే రావు పేర్కొన్నారు. భద్రత వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. జీవితంలో అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం భద్రతపై ఆన్‌లైన్లో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. పోర్టు ఆపరేషన్స్ హెడ్ మోహిత్, సెక్యూర్టీ హెడ్ వెంకటేష్ భాస్కరన్, దివ్యప్రణీత్, మనోహర్ బాబు, సేఫ్టీ హెడ్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వరిలో ఆకుమచ్చ తెగులు



రైతులకు సలహాలిస్తున్న వాసు

పొదలకూరు: మండలంలోని సూరాయపాళెం, మహ్మదాపురం, తాటిపర్తి గ్రామాల్లో వరిసాగులో ఆకుమచ్చ తెగులు, జింక్ లోపాన్ని గుర్తించామని ఏఓ వాసు పేర్కొన్నారు. వరిసాగు చేస్తున్న గ్రామాల్లో మంగళవారం పర్యటించిన ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. మండలంలో సాగవుతున్న బీపీటీ 5204, ఆరెన్నార్ 15048 రకాల్లో ఆకుమచ్చ తెగులుతో పాటు జింక్ లోపం ఉందన్నారు. పొట్ట, వెన్నుతీసే దశలో ఆకుమచ్చ, గింజపై నల్లమచ్చ తెగులు నివారణకు టిల్ట్ రెండు గ్రాములను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఆరెన్నార్ 15048 (తెలంగాణ మసూరీ), బీపీటీ 5204 (జిలకర మసూరీ), ఎన్ఎల్ఆర్ 34449 (నెల్లూరు మసూరీ) రకాల్లో పిలకలను తొలిచే దశ నుంచి కరుకు చిరుపొట్ట దశ వరకు కాంటాఫ్ + అనే శిలీంధ్ర నాశినిని రెండు మిల్లీలీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలని కోరారు. 30 నుంచి 40 రోజుల వయస్సు గల వరిలో జింక్ లోప నివారణకు గానూ ఎకరాకు 100 గ్రాముల 12 శాతం జింక్ సల్ఫేట్‌ను నాటిన నెల్లోపు రెండుసార్లు పిచికారీ చేసుకోవాలని సూచించారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



తోటపల్లిగూడూరు: సంక్రాంతిని పురస్కరించుకొని నిర్వహిస్తున్న క్రీడా సంబరాలు మంగళవారంతో ముగిశాయి. స్థానిక సర్పంచ్ చింతా సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో యువతకు కబడ్డీ, వాలీబాల్‌తో పాటు మహిళలకు రంగవల్లుల పోటీలను నిర్వహించారు. కబడ్డీలో విజేతగా రాజు జట్టు, వాలీబాల్‌లో విన్నర్స్‌గా సునీల్ జట్లు నిలిచాయి. రంగవల్లుల పోటీల్లో పద్మ, లిఖిత, దివ్యశ్రీ విజేతలుగా నిలిచారు. వీరికి బహుమతులను సర్పంచ్ మణి అందజేశారు.

ఎమ్మెల్యే ప్రసన్న పర్యటన నేడు

కోవూరు: మండలంలోని పోతిరెడ్డిపాళెం పంచాయతీ పరిధిలో రూ.50 లక్షలతో నిర్మించిన సైడ్ డ్రెయిన్, రూ.24 లక్షలతో ఎంపీపీ స్కూల్‌ను కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి బుధవారం ప్రారంభించనున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. రూ.15 లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డుకు శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు హాజరుకావాలని కోరారు.

గొలగమూడిలో లక్ష్మీనారాయణ పూజలు



వెంకటాచలం: గొలగమూడిలోని వెంకయ్యస్వామి ఆశ్రమాన్ని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. పార్టీ నేత పెంచలయ్య, యువ మోర్చా మండలాధ్యక్షుడు నరేష్, తదితరులు స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు.

కామాక్షితాయి సేవలో..



బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారిని ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ రవిచంద్రారెడ్డి తన కుటుంబసభ్యులతో కలిసి మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారిని సత్కరించారు. ఆలయ చైర్మన్ సుబ్రహ్మణ్యంనాయుడు, ఈఓ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

గొబ్బెమ్మల పండగ నేడు

బుచ్చిరెడ్డిపాళెం: జొన్నవాడలో కొలువైన కామాక్షితాయి అమ్మవారి సన్నిధి సమీపంలోని పెన్నా తీరంలో గొబ్బెమ్మల పండగను బుధవారం నిర్వహించనున్నామని ఆలయ చైర్మన్ సుబ్రహ్మణ్యంనాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాన్ని సాయంత్రం నాలుగు గంటల నుంచి నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

గ్రిగ్స్ పోటీలకు నమోదు చేసుకోండి

ఇందుకూరుపేట: కోవూరు నియోజకవర్గ గ్రిగ్స్ పోటీల్లో పాల్గొనేందుకు గానూ తమ పాఠశాల ఎంట్రీని ఈ నెల 20వ తేదీ ఉదయం పది గంటల్లోపు అందజేయాలని జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, వ్యాయామ ఉపాధ్యాయురాలు ఝాన్సీలత, పల్లవి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థుల వివరాలను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పీడీలు తెలియజేయాలని సూచించారు.

వ్యక్తిపై దాడి

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు): వ్యక్తిపై దాడికి పాల్పడిన ఘటన మండలంలోని ఊటుకూరు పంచాయతీ పరిధిలో గల శంకర్‌నగర్ కాలనీ వద్ద చోటుచేసుకుంది. ఎస్సై ఆనంద్‌భాస్కర్‌బాబు వివరాల మేరకు.. శంకర్‌నగర్ కాలనీకి చెందిన ఓ యువతి స్థానికంగా పానీపూరి తింటుండగా, కంచరపాళేనికి చెందిన ఉదయ్ ఆమెతో అసభ్యకరంగా మాట్లాడాడు. దీంతో విషయాన్ని తన బంధువైన దయాకర్‌కు యువతి తెలియజేశారు. ఘటన స్థలానికి వచ్చిన ఆయనకు అక్కడ ఎవరూ కనిపించకపోవడంతో కంచరపాళేనికి చెందిన పెద్దలకు ఫోన్ ద్వారా విషయాన్ని తెలియజేశారు. అనంతరం అక్కడి పెద్దలు తమ కాలనీకి చెందిన ఉదయ్‌ను మందలించారు. దీంతో ఆగ్రహానికి గురైన ఉదయ్ తన స్నేహితులైన ప్రసాద్, రవితో పాటు మరో ఐదుగురితో శంకర్‌నగర్ కాలనీకి వచ్చారు. అక్కడ పానీపూరి బండిపై ఉన్న స్టౌతో దయాకర్‌పై దాడి చేశారు. ప్రమాదంలో దయాకర్ కాలికి గాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉపాధి హామీ క్షేత్ర సహాయకులతో సమావేశం



మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యం

కొడవలూరు: మండలంలో రోజూ వెయ్యి మందికి విధిగా పని కల్పించాలని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం ఆదేశించారు. మండలంలోని ఉపాధి హామీ క్షేత్ర సహాయకులతో స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి పంచాయతీలో జనాభా ప్రాతిపదికన పని కల్పించాల్సిన బాధ్యత క్షేత్ర సహాయకులపై ఉందని చెప్పారు. జాబ్ కార్డును ఆధార్‌తో అనుసంధానం చేయాలని సూచించారు. రోజూ వెయ్యి మంది కూలీల కంటే తక్కువ మంది పనిచేస్తే దానికి క్షేత్ర సహాయకులే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఏపీఓ రమణయ్య, టీఏ బాబు, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా స్వామిత్వ రీసర్వే



సర్వేను పరిశీలిస్తున్న రమణయ్య

మనుబోలు: మండలంలో స్వామిత్వ రీసర్వే ముమ్మరంగా జరుగుతోంది. అక్కంపేటలో రీసర్వేను పంచాయతీ విస్తరణాధికారి రమణయ్య మంగళవారం పరిశీలించిన అనంతరం మాట్లాడారు. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం ద్వారా పంచాయతీల పరిధిలోని గ్రామ కంఠంలో గల ప్రతి ఇంటినీ రీసర్వే చేసి యజమానులకు హక్కు పత్రాలను ఇవ్వనున్నారని చెప్పారు. రీసర్వేను రెండు రోజుల్లో పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు సుమంతి, అంకబాబు, సచివాలయ సర్వేయర్లు వెంకమ్మ, మధు, రాజశేఖర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ మణికంఠ, డిజిటల్ అసిస్టెంట్ సునీల్, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పొదలకూరు: పట్టణంలోని డీఎన్నార్ జెడ్పీ హైస్కూల్లో 1982 – 83 మధ్య పదో తరగతి చదివిన వారు పాఠశాలలో మంగళవారం కలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరేసుకొని ఉత్సాహంగా గడిపారు. అప్పటి మ్యాథ్స్ టీచర్ సుబ్బరామిరెడ్డిని సత్కరించారు. పట్టణంలోని నర్సారెడ్డి కాలనీలో ఉన్న వృద్ధాశ్రమానికి రూ.పది వేల విలువైన సరుకులను అందజేశారు. ప్రభాకర్, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, సురేష్, శ్రీహరి, కాళిదాస్, పెంచలరెడ్డి, పీ వెంకటేశ్వర్లు, గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆందోళన విరమణ



మాట్లాడుతున్న శివప్రసాద్

ముత్తుకూరు: మండలంలోని పైనాపురం పంచాయతీలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు నిర్వాహకులు ముందుకు రావడంతో ఆందోళనను విరమిస్తున్నామని మాజీ జెడ్పీటీసీ శివప్రసాద్ పేర్కొన్నారు. సెంబ్‌కార్ప్ పవర్ ప్రాజెక్ట్ ఎదుట ఈ నెల రెండు నుంచి నిర్వహిస్తున్న ఆందోళనను మంగళవారం విరమించారు. ప్రాజెక్ట్ ప్రతినిధి రఘురామ్‌తో జరిపిన చర్చల ఫలితంగా 13 అంశాలపై అంగీకారం కుదరడంతో ఆందోళనను విరమించామని చెప్పారు. గ్రామస్తులకు సంబంధించిన ప్యాకేజీ, ఉద్యోగాలు, కాంట్రాక్టులు, కాలుష్య నివారణ, వైద్య సౌకర్యాల కల్పన, తదితర అంశాలను దశల వారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. సర్పంచ్ విజయ్‌కుమార్, ఎంపీటీసీ శివ, రఘు పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు



మనుబోలు: మనుబోలులోని జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఎస్సార్ క్రికెట్ టోర్నీ హోరాహోరీగా సాగుతోంది. కొండూరు, వైసీసీఎం, స్టార్ లెవన్, కొమ్మలపూడి, ఏడబ్ల్యూ యూత్ జట్లు మంగళవారం విజయం సాధించి ముందంజ వేశాయి. మొదటి మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన మనుబోలు యూత్ 25 పరుగులకే ఆలౌటైంది. లక్ష్యాన్ని ఛేదించి కొండూరు జట్టు విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో ఎల్ఎన్‌పురంపై వైసీసీఎం జట్టు విజయకేతనం ఎగురవేసింది. మూడో మ్యాచ్‌లో చెర్లోపల్లి జట్టుపై స్టార్ లెవన్ జట్టు గెలుపొందింది. నాలుగో మ్యాచ్‌లో కేఆర్‌పురం యూత్ జట్టుపై కొమ్మలపూడి, తర్వాతి మ్యాచ్‌లో కృష్ణ లెవన్ జట్టుపై ఏడబ్ల్యూ యూత్ జట్టు విజయం సాధించాయి. సురేష్, సాయి, సదానంద్, భాను, సుబ్రహ్మణ్యం మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులను గెలుచుకున్నారు.

టీడీపీ కార్యకర్తలు నోరు అదుపులో పెట్టుకోవాలి



మాట్లాడుతున్న వైఎస్సార్సీపీ నేతలు

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు): టీడీపీ కార్యకర్తలు నోరు అదుపులో పెట్టుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు హితవు పలికారు. విడవలూరులోని పార్టీ నేత అచ్యుత్‌రెడ్డి నివాసంలో విలేకరుల సమావేశంలో మంగళవారం వారు మాట్లాడారు. కొడవలూరు మండలంలోని మానేగుంటపాడుకు చెందిన కొందరు టీడీపీ కార్యకర్తలు విడవలూరుకు చెందిన అదే పార్టీ కార్యకర్తను విమర్శిస్తూ సోషల్ మీడియాలో ఆడియోను వైరల్ చేశారని తెలిపారు. ఈ విషయంతో సంబంధం లేని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని టీడీపీ కార్యకర్తలు విమర్శించడం దారుణమన్నారు. సోషల్ మీడియాలో విమర్శలు చేస్తూ పోస్టులు పెట్టిన వారిని వదిలేసి తమ పార్టీ నేతలను విమర్శించడం తగదని సూచించారు. పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి వద్ద జీతానికి పని చేసే వ్యక్తి.. ఎమ్మెల్యేను విమర్శించడం తగదన్నారు. మాజీ ఏఎంసీ చైర్మన్ అచ్యుత్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు నవీన్‌కుమార్‌రెడ్డి, నేతలు విజయభానురెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, తిరుపతి, శ్రీహరిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత ఏబీకే సోల్జర్స్



ఇందుకూరుపేట: మండలంలోని జగదేవిపేటలో నిర్వహించిన మన్నెంగి కృష్ణారెడ్డి మెమోరియల్ గ్రామస్థాయి క్రికెట్ పోటీల్లో ఏబీకే సోల్జర్స్ జట్టు విజేతగా నిలిచింది. ద్వితీయ స్థానాన్ని ఏబీకే వారియర్స్ జట్టు సాధించింది. విజేత జట్టుకు రూ.ఆరు వేలు, రన్నర్స్‌కు రూ.నాలుగు వేలు, మెమెంటోలను అందజేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత నరేంద్రరెడ్డి, కుమార్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, ధీరజ్, జయకుమార్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.